## క్లుప్తంగా

### ముస్లిం మహిళలకు చీరల పంపిణీ



పేద ముస్లిం మహిళలకు చీరలు అందిస్తున్న ముజీబ్‌ఖాన్, ముత్తు సోములు

డాబాగార్డెన్స్: రంజాన్ మాసం సందర్భంగా వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఎండీ ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో సోమవారం పలువురు పేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వార్డు నాయకుడు ముత్తు సోములు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కమల్, సత్య, రమణ, దూడ తాతారావు, ఇబ్రహీం, వెంకటి, గిరి, మధు, సిలార్, బంగారి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

### నేడు 'ఉగాది ఉత్సవ్' ప్రతిభ పోటీలు




చిన్నారులతో పోస్టర్ ఆవిష్కరిస్తున్న షకీల్

డాబాగార్డెన్స్: ఉగాది పండగను పురస్కరించుకొని మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో 'ఉగాది ఉత్సవ్–2024' పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ తెలిపారు. సోమవారం క్లబ్ కార్యాలయంలో చిన్నారులచే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ మీ ప్రతిభకు మా పట్టాభిషేకం శీర్షికన పోటీలు జరుపుతున్నట్టు చెప్పారు. కూచిపూడి నృత్యం, భరతనాట్యం, జానపద నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, సినిమా పాటలు, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్, పెద్దలకు వస్త్రాలంకరణ పోటీలు ఉంటాయన్నారు. మంగళవారం సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా నిర్వహించనున్న పోటీలో పాల్గొనదలచే వారు 99664 85335 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవచ్చు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం



విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

విశాఖ విద్య : నాణ్యమైన విద్య అందించడం వల్లే తమ సంస్థల్లో చదువుకునే విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ పరీక్షల్లో సత్తా చాటుతున్నారని శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం సురేష్ అన్నారు. రామ్‌నగర్ శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఐఎన్‌టీఎస్‌వో – 2023 పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించారు. 22 మందికి ల్యాప్‌టాప్‌లు, 30 మందికి ట్యాబ్‌లు అందజేశారు. మరో 2,133 మంది విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సీమ, అహ్మద్ అలీ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం జగన్‌కే ప్రజల మద్దతు

- పేదల గౌరవం పెంచేలా ఐదేళ్ల పాలన
- వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్
- 38వ వార్డు నుంచి వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



వైఎస్సార్ సీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : గత ఐదేళ్లలో రాష్ట్రంలోని పేదల గౌరవం పెంచేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగించారని, అందుకే ప్రజలంతా మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 38వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు గురజాపు రవి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో 200 మంది పార్టీలో సోమవారం చేరారు. వారికి వాసుపల్లి గణేష్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎందుకు ఓటు వేయకూడదో ప్రతిపక్ష పార్టీల నాయకులు ఒక్క కారణమైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూటమి సీఎం జగన్‌పై, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజల వద్దకు పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బాబా సాహెబ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు వలంటీర్ వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. నేను టీడీపీలో పనిచేశానని, ప్రస్తుతం వైఎస్సార్ సీపీలో వున్నానని... ఈ రెండు పార్టీలకు సముద్రమంత వ్యత్యాసం ఉందన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన తర్వాత దక్షిణ నియోజకవర్గ ప్రజలకు న్యాయం, సాయం చేయగలిగానని స్పష్టం చేశారు. చంద్రబాబు, జనసేన పార్టీలను నమ్మొద్దన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీలో స్థానికులతోపాటు చైతన్య కంప్యూటర్స్ ఇన్‌స్టిట్యూట్ టీం దేవి, జగ్గా టీమ్ చేరారు. కార్యక్రమంలో నాయకులు కోసూరు వాసు, రామోజీ, పెదబాబు, పాటోజి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలోకి పెయిందొరపేట మత్స్యకారులు**

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు పెయిందొరపేటకు చెందిన పలువురు మత్స్యకారులు సోమవారం వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వార్డు నాయకులు కాసారపు వాసు, నొల్లు పోతుస్వామి ఆధ్వర్యంలో చేరిన వారికి వాసుపల్లి గణేష్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

**మేదరి సంఘానికి సముచితస్థానం కల్పిస్తాం**

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డుకు చెందిన 200 కుటుంబాలు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. సోమవారం సాయంత్రం వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్ దరి సంఘం హాల్లో శాంతి విశాఖ మేదరి సంఘం సభ్యులకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. చేతి వృత్తిదారులకు కూడా జగనన్న తోడు పథకం అమలు చేసి ఆదుకున్నారన్నారు. మేదరి వృత్తి చేస్తున్న వారందరికీ సముచిత స్థానం కల్పిస్తూ అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న, నియోజకవర్గంలో వాసుపల్లి చేస్తున్న అభివృద్ధి, పేదలకు చేస్తున్న మేలు చూసి వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. తామందరం వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఆదివిష్ణు, సుబ్రహ్మణ్యం, సంఘం అధ్యక్షుడు గ్రంధి అప్పారావు, భాస్కరరావు, మొగ్గ శ్రీను, నర్రు ప్రకాష్, రొట్ట గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, జాన్‌వెస్లీ



వైఎస్సార్ సీపీలో చేరిన మేదరి సంఘం ప్రతినిధులతో వాసుపల్లి గణేష్‌కుమార్, తదితరులు

## ఘనంగా నూకాంబిక జాతర మహోత్సవం



నేతాజీనగర్‌లో నూకాంబిక అమ్మవారు



రామకృష్ణ జంక్షన్‌లో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అల్లిపురం: కొత్త అమవాస్య సందర్భంగా సోమవారం అల్లిపురం, కొబ్బరితోట, నేతాజీ నగర్, రామకృష్ణ జంక్షన్, ఏడుగుళ్ల స్లమ్‌లోని నూకాంబిక అమ్మవారి దేవాలయాల వద్ద జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా దేవాలయాల ఉత్సవ కమిటీలు భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయాల వద్ద అమ్మవారి మాలధారులు అగ్ని గుండ ప్రవేశం చేశారు. డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, సాము గరిడీలు మధ్య అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

## జీవన విధానం ప్రతిబింబించే పండగే ఉగాది

డాబాగార్డెన్స్: మానవ జీవన విధానం ప్రతిబింబించే పండగే ఉగాది అని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే రామేశ్వరి తెలిపారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఉగాది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది విశిష్టతను ఆమె తెలిపారు. మన జీవితంలో జరిగే సంఘటనలన్నీ కూడా ఉగాది పర్వదినంతో ముడిపడి వుంటాయన్నారు. అందువల్లే తీపి, కారం, చేదు ఇలా అన్నీ సమపాలల్లో మిళితం చేసి ఉగాది పచ్చడి చేస్తారన్నారు. నూతన సంవత్సరాది దిని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ దేవాలయాలు సందర్శించి, ఆధ్యాత్మిక భావంతో ముందుకు సాగాలన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి సత్యవతి మాట్లాడుతూ పురాణ ఇతిహాసాల్లో ఉగాది పర్వదినానికి ఎనలేని ప్రాధాన్యత ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, నాగరాజ్ పట్నాయక్, పావని పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ప్రాధాన్యం



ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న పైడిరాజు, మహేశ్వరరావు

విశాఖ విద్య: ప్రభుత్వ బడుల్లో సోషల్ స్టడీస్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు ఇమంది పైడిరాజు అన్నారు. సోషల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నగరంలోని జూబ్లీ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడుగా ఇమంది పైడిరాజు (అడవివరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం), అధ్యక్షుడిగా సింగంపల్లి రామారావు(జీహెచ్‌ఎస్ పెందుర్తి), ప్రధాన కార్యదర్శిగా వి.బాలాజీ ఎంపికయ్యారు. మహిళా ప్రతినిధిగా ఎస్. సంధ్యారాణి (ప్రభుత్వ క్వీన్ మేరీ స్కూల్), గౌరవ సలహాదారుగా ఎస్.కృష్ణారావు, రాష్ట్ర కౌన్సిలర్‌గా టీ. రామారావు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా ఆర్‌వీ.నారాయణను ఎన్నుకున్నారు. అదేవిధంగా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.పాండవులు, ఆర్థిక కార్యదర్శిగా ఎంవీఆర్ సోమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోషల్ స్టడీస్‌పై విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేలా భవిష్యత్‌లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ఎస్.మహేశ్వరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

## మిసెస్ ఇండియా విజేతకు ఘన సత్కారం



కొణతాల భాగ్యలక్ష్మిని సత్కరించి అభినందిస్తున్న కొత్తపల్లి జ్యోతి, పైడి రజని

డాబాగార్డెన్స్: ఇటీవల ఢిల్లీ వేదికగా జరిగిన మిసెస్ ఇండియా పోటీల్లో ఉత్తరాంధ్రకు చెందిన కొణతాల భాగ్యలక్ష్మి రెండు ప్రతిష్టాత్మకమైన అవార్డులు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఆమెను వీజేఆర్ ఈవెంట్స్ అధినేత కొత్తపల్లి జ్యోతి, పైడి రజనీల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. వారిరువురూ మాట్లాడుతూ భాగ్యలక్ష్మి మిసెస్ ఛార్మింగ్–2024 అవార్డుతోపాటు బ్యూటీ విత్ హార్ట్–2024 అవార్డును కైవసం చేసుకున్నారని, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తన కుటుంబ సభ్యుల సంపూర్ణ సహకారంతోనే తాను ఇంతటి స్థాయికి ఎదిగానని తెలిపారు. త్వరలో జరగనున్న మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ పోస్టర్‌ను విజేత భాగ్యలక్ష్మితో కార్యక్రమ నిర్వాహకులు ఆవిష్కరింపజేశారు.

## జగదీశ్వరికి పీహెచ్‌డీ ప్రదానం

డాబాగార్డెన్స్: ఆంగ్ల సాహిత్యంలో రచయిత్రి కావేరి నంబిసైన్ రాసిన నవలలపై ఆచార్య ప్రసన్న మార్గదర్శకత్వంలో చేసిన అధ్యయనానికి చొక్కాకుల జగదీశ్వరికి పీహెచ్‌డీ అవార్డు ప్రదానం చేశారు. ఏయూ ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా సోమవారం వీసీ కార్యాలయంలో ఆమె పీహెచ్‌డీ అందుకున్నారు.

## పారిశుధ్య కార్మికులకు వితరణ



మహిళా కార్మికులకు చీరలు అందిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ: రంజాన్ మాసం సందర్భంగా స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ చైర్మన్ మక్సూద్ అహ్మద్‌లు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. 39వ వార్డులో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సంస్థలో ప్రతి ఏటా రంజాన్ సందర్భంగా చీరలు అందిస్తున్నామన్నారు. పేద మహిళలకు వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్న సభ్యులకు అభినందనలు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## విశేషంగా ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రవర్తి తదితరులు ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమ వారం సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలను పఠించి స్వామికి హారతి ఇచ్చారు.

## పూర్ణామార్కెట్‌కు ఉగాది శోభ



పూర్ణామార్కెట్‌లో పువ్వులు కొంటున్న మహిళలు



మామిడికాయలు, పత్రులు విక్రయిస్తున్న వ్యాపారి



వేపపువ్వు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

జగదాంబ: పూర్ణామార్కెట్ సోమవారం ఉగాది శోభను సంతరించుకుంది. మంగళవారం నాడు ఉగాది పండగను పురస్కరించుకుని నగర ప్రజలతో నిండిపోయింది. ఉగాది పచ్చడికి కావల్సిన మామిడికాయలు, వేపపువ్వు, మామిడి పత్రులు, బెల్లం, పూజకు కావాల్సిన పువ్వులు, పసుపు, కుంకుమలతోపాటు ఇతర వస్తువుల విక్రయాలు జోరుగా సాగాయి. తెలుగు వారి నూతన సంవత్సరాది వేళ.. పూర్ణామార్కెట్ వినియోగదారులతో కళకళలాడింది. వ్యాపారులు మామిడి కాయలు, అరటి పండ్లు, పూజా సామగ్రి ధరలు పెంచి సొమ్ము చేసుకున్నారు.

## సమాజాభివృద్ధికి కళాకారులు దిక్సూచి



కళాకారులను సత్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్ : సమాజాభివృద్ధికి కళాకారులు దిక్సూచిగా నిలుస్తున్నారని పద్మశ్రీ యడ్ల గోపాలరావు, ఉపకార్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులు తమ ప్రతిభతో సమాజాన్ని జాగృతం చేస్తున్నారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ కళాకారులను సత్కరించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. కళాకారులు డాక్టర్ రాపేటి అప్పారావు, రమేష్ పట్నాయక్, సీహెచ్ రమేష్, పి.సీతాప్రసాద్, డేవిడ్ రాజ్, బొట్టా నాగేశ్వరరావు, సందీప్, తదితరులకు ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబు, ఆర్.నాగరాజ్ పట్నాయక్, శివజ్యోతి, జనార్ధన్, అరుణ్‌సాయి, ధనుంజయ్, ప్రసాద్, కల్యాణ్, సత్య, విజయరమణి, తదితరులు పాల్గొన్నారు.

## 'నా ఆరోగ్యం – నా హక్కు'పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ. చిత్రంలో పూర్ణేంద్రబాబు, ఉమావతి, నాగేశ్వరరావు

మహారాణిపేట: 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే విషయంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ సమావేశ మందిరంలో 'నా ఆరోగ్యం – నా హక్కు' అనే అంశంపై లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శేషమ్మ మాట్లాడారు. పోక్సో చట్టం, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కలెక్షన్, డిస్పోజల్ గురించి వివరిస్తూ లీగల్ అవేర్‌నెస్ ఏ విధంగా పాటించాలనే దానిపై వైద్యులు వృత్తి నియమాలు పాటిస్తూ చట్టబద్ధంగా ప్రవర్తించాలన్నారు. తద్వారా సమస్యలు ఉత్పన్నం కావని చెప్పారు. ఆరోగ్య విషయాల్లో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డాక్టర్ పూర్ణేంద్రబాబు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల చాలా వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి మాట్లాడుతూ మంచినీరు తాగడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వరరావు, పలువురు వైద్యులు డాక్టర్ బద్రీ, డాక్టర్ జగదీశ్ ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం, హెల్త్ ఎడ్యుకేటర్, పలు ప్రైవేటు ఆస్పత్రుల డాక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సబాస్టియన్ కాలనీ 319 సచివాలయం పరిధి శివాలయం వెనుక బూట్ లాండ్రీ, స్పార్కెల్ లాండ్రీ సర్వీసెస్ ఎదురుగా ఉన్న తుప్పల్లో సుమారు 40 నుంచి 50 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే సచివాలయ మహిళా పోలీస్‌కు సమాచారం అందించారు. మహిళా పోలీస్‌తోపాటు అక్కడ విధులు నిర్వహిస్తున్న వీఆర్‌వో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి కోసం విచారించగా చుట్టుపక్కల ప్రాంతాల్లో భిక్షాటన చేస్తుంటాడని తెలిసింది. అతడు చనిపోయి సుమారు 3 నుంచి 5 రోజులై ఉండవచ్చని, శవం కుళ్లిపోయింది. ఐదో పట్టణ పోలీసులకు సోమవారం వీఆర్‌వో ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ బి.నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## గెలిచేది వైఎస్సార్‌సీపీయే..



30వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం

మహారాణిపేట: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిచి తిరిగి అధికారంలోకి వస్తుందని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణా స్వీకారం చేస్తారని 30వ వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం అన్నారు. 30వ వార్డు కొత్త జాలరిపేటలో సోమవారం కార్పొరేటర్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌లకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల చిన్ని, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

**వేంకటేశ్వరమెట్ట రామ్‌రామ్ మందిరంలో ఏర్పాట్లు**

డాబాగార్డెన్స్: అల్లిపురం వేంకటేశ్వరమెట్ట రామ్ రామ్ మందిరంలో ఈ నెల 9 నుంచి 17 వరకు శ్రీరామనవమి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ప్రతినిధి సుధా హనుమంతరావు తెలిపారు. ఉగాది పండగ సందర్భంగా మంగళవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు రాం రాం భజన బృందంచే హరినామ సంకీర్తన, 10న బంగారమ్మతల్లి భజన మండలిచే భక్తి విభావరి, 11న మనోరంజని మ్యూజికల్ స్కూల్‌చే సంగీత కచేరి, 12న పతంజలి భక్తి ఆర్కెస్ట్రాచే భక్తి మంజరి, 13న రామభక్త భజన బృందంచే హరిహరనామ సంకీర్తన, 14న తుంబుర హరిహరి నామ సంకీర్తనా మిత్రమండలిచే హరిహరనామ సంకీర్తన, 15న సాయి దుర్గ భజన బృందంచే సాయా గానామృతం, 16న భాషా సేవక సమితిచే శ్రీరామగానామృతం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. 17న ఉదయం 9.30 గంటలకు 69వ సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించనున్నామని, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు వివిధ భక్త బృందాలచే ఏకాహం సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్టు హనుమంతరావు చెప్పారు.